
బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి భక్తాంజలి ఘటిస్తూ

మహానందమాయె ఓ మహా దేవదేవా



# ఏడు కొండల వేంకటేశా నిన్నేమని ప్రార్థించగలను!

## హరివో హరుడవలో రామడివో కృష్ణుడవో! అందరివై ఉన్నావయ్యా!



**శ్రీ వేంకటాచలాధీశం శ్రియాధ్యాసిత వక్షసం**
**శ్రిత చేతన మందారం శ్రీనివాస మహంభజే**

శ్రీ వేంకటమను పర్వతమునకు ప్రభువు, లక్ష్మీదేవిని వక్షఃస్థలమున ధరించినవాడు, ఆశ్రితజనులకు కల్పవృక్షము వంటివాడు అగు శ్రీనివాసుని ఎల్లప్పుడు కొలుచుకుంటాను.

**శ్రీవేంకటేశమత్యామిన్ జ్ఞానానంద దయానిధే**
**భక్తవత్సల భో విశ్వకుటుంబి న్నధునా వ మామ్**

ఓ వేంకటేశా! జ్ఞానం, ఆనందం, దయ అనువాటికి ఆశ్రయుడవు. ఓ భక్తవత్సలా! ఈ ప్రపంచమంతటిని స్వకుటుంబముగా భావించి భరించువాడవు నీవే! నా స్వామియగు వేంకటేశా! నన్ను రక్షించుము. అనుగ్రహించుము.

**శ్రవణాత్సర్వ పాపఘ్నం మననాత్పుణ్య వర్ధనం**
**స్వధ్యానాత్సిద్ధిదం విష్ణుం ప్రేక్షణాన్మోక్షదం భజే**

మహిమలను వినుట మాత్రం చేతనే సర్వపాపాలను పోగొట్టువాడు. వాటిని మరల మరల తలంచుటచే పుణ్యాన్ని వృద్ధి చేయువాడు. వాటిని మరల మరల ధ్యానించటం వలస సమస్త సిద్ధులను ఇచ్చువాడు, చూచుట వలననే మోక్షము నొసంగువాడు అగు విష్ణుదేవా నిను సేవింతును.

**శ్రీవేంకటేశం లక్ష్మీశం అనిష్టఘ్న మభీష్టదం**
**చతుర్ముఖాఖ్య తనయం శ్రీనివాసం భజే నిశమ్॥**

ఓ వేంకటాచలపతీ! లక్ష్మీనాథా! నీవు భక్తుల యొక్క అనిష్టములను తొలగించి, అభీష్టములను ఇచ్చువాడవు. నాలుగు ముఖాలు గల బ్రహ్మ నీ కుమారుడు. ఓ శ్రీనివాసా! నిన్ను ఎల్లప్పుడూ సేవింతును. (నిద్ర నుండి మేల్కొన్నప్పుడు, రాత్రిపూట, ప్రయాణకాలలలో, ఆపద సమయాలలో ఈ శ్లోకాన్ని రెండుమార్లు పఠిస్తే అనుకున్న పనులలో విజయం తథ్యమని పెద్దలమాట)

**యదాపంగలవేనైవ బ్రహ్మాద్యాః స్వపదం యయుః**
**మహారాజాధిరాజం త్వాం శ్రీనివాసం భజేనిశమ్**

ఎవరి కృపాకటాక్షలేశముచే బ్రహ్మాదిదేవతులు ఉత్తమ స్థానాలైన సత్యలోకాదులకు ఆధిపత్యములను పొందియున్నారో, ఆ బ్రహ్మాదులనెడి మహారాజులకు చక్రవర్తి అయిన శ్రీనివాసుని ఎల్లప్పుడు సేవించుకుంటాను.

**అనంతవేద సంవేద్యం నిర్దోషం గుణసాగరం**
**అతీంద్రియం నిత్యముక్తం శ్రీనివాసం భజే నిశమ్**

అనంతములైన వేదాల చేతనే తెలియదగినవాడు, దోషగుణాలు లేనివాడు, జ్ఞానానందాది శుభగుణాలచే పరిపూర్ణుడు, నేత్రాది ఇంద్రియాలకు కనిపించనివాడు, నిత్యముక్తుడు అయిన శ్రీనివాసుని ఎల్లప్పుడు సేవించుకుంటాను.

**సరణాత్ సర్వదోషఘ్నం శ్రవణాదిష్టవర్షిణం**
**దర్శనాన్ముక్తిదం వీరం శ్రీనివాసం భజే నిశమ్**

నామస్మరణముచే సమస్త పాపాలను హరించువాడు, స్తోత్రం చేయటం వల్ల భక్తులకు అభీష్టాలను గుప్పించువాడు, దర్శనం వలన ముక్తినిచ్చువాడు, సర్వస్వామియగు శ్రీనివాసుని నేను ఎల్లప్పుడు కొలుచుకుంటాను.

**అశస్త్రషశయనం శేషశయనం శేషశాయినం**
**శేషాద్రీశమశేషం చ శ్రీనివాసం భజే నిశమ్**

ప్రపంచములోని అన్ని వస్తువులలో శయనించియున్నవాడు, సకల చేతనుల హృదయములలో శయనించియున్నవాడు. ఆదిశేషునిపై శయనించియున్నవాడు, శేషాచలమునకు అధిపతి, సర్వము తానే అయినవాడు అగు శ్రీనివాసుని సేవించుకుంటాను.

**భక్తానుగ్రాహకం విష్ణుం సుశాంతం గరుధధ్వజం**
**ప్రసన్నవక్త్రనయనం శ్రీనివాసం భజే నిశమ్**

తన భక్తులను అనుగ్రహించువాడు, అంతటా వ్యాపించియున్నవాడు, సజ్జనులకు సుఖమును కలిగించువాడు, గరుత్మంతుడు ధ్వజంగా గలవాడు, భక్తులను అనుగ్రహించునపుడు ప్రసన్నమై ముఖం, నేత్రాలు గలవాడగు శ్రీనివాసుని నిత్యము సేవింతును.

**భక్తభక్తి సుపాశేన బద్ధసత్వాద పంకజం**
**సనకాది ధ్యానగమ్యం శ్రీనివాసం భజే నిశమ్**

తన భక్తుల యొక్క భక్తియను దారంతో బంధింపబడ్డ పాదపద్మాలు గలవాడు, సనక సనందనాది యోగులకు ధ్యానంతో కనిపించువాడైన శ్రీనివాసుని ఎల్లప్పుడు సేవించెదను.

**గంగాది తీర్థజనక పాదపద్మం సుతారకం**
**శంఖ చక్రాభయవరం శ్రీనివాసం భజే నిశమ్**

గంగాది పుణ్యతీర్థాలకు జన్మస్థానమైన పాదపద్మాలుగలవాడు, భక్తులను సంసార సముద్రం నుండి తరింపజేయువాడు, శంఖుచక్రాలను, అభయముద్ర, వర ముద్రలను నాలుగు చేతులందు ధరించినవాడైన శ్రీనివాసుని ఎల్లప్పుడు సేవించుకుంటాను.

**సువర్ణముఖి తీరస్థం సువర్ణేద్యం సువర్ణదం**
**సువర్ణాభరణం సువర్ణాంకం శ్రీనివాసం భజే నిశమ్**

సువర్ణముఖి నదీ తీరాన నివసించువాడు, సువర్ణములు గల వేదాలచే స్తుతింపబడినవాడు, భక్తులకు సంపదలనిచ్చువాడు, బంగారుఛాయవంటి ప్రకాశం గలవాడు, సువర్ణమయమైన కిరీట, కుండలాద్యాభరణాలచే అలంకరింపబడిని శరీరభాగాలుగల వాడగు శ్రీనివాసుని నేను నిత్యం సేవించుకుంటాను.

**శ్రీవత్స వక్షసం శ్రీశం శ్రీలోలం శ్రీకర గ్రహం**
**శ్రీమంతం శ్రీనిధిం శ్రీధ్యం శ్రీనివాసం భజే నిశమ్**

శ్రీవత్సమనెడి మచ్చ వక్షఃస్థలమున గలవాడు, లక్ష్మీదేవికి భర్త, లక్ష్మీవిలాసము లందు ఆసక్తిగలవాడు, శ్రీదేవిని వివాహమాడినవాడు, శ్రీమంతుడు, శ్రీనిధి, శ్రీదేవిచే స్తుతింపబడినవాడు అగు శ్రీనివాసుని నేను ఎల్లప్పుడు సేవించెదను.

**వైకుంఠవాసం వైకుంఠ త్యాగం వైకుంఠసోదరం**
**వైకుంఠదం వికుంఠ శ్రీనివాసం భజే నిశమ్**

వైకుంఠవాసుడు, భక్తుల కొరకు వైకుంఠమును విడిచి, వేంకటాద్రికి వచ్చినవాడు, వైకుంఠుడను పేరుగల సోదరుడు గలవాడు, ఎల్లప్పుడు భక్తులకు మోక్షమును ఇచ్చువాడు, రైవత మన్వంతరమున శుభ్రుని భార్యయగు 'వికుంఠా' అను తల్లి గర్భమున జన్మించిన వాడగు శ్రీనివాసుని సదా సేవించుకుంటాను.

### దశావతారుడవు



**వేదోద్ధారం మత్స్యరూపం స్వచ్ఛాకారం యదృచ్ఛయా**
**సత్యవ్రతోద్ధరం సత్యం శ్రీనివాసం భజే నిశమ్**

తన ఇష్టప్రకారం మత్స్యరూపాన్ని ధరించి, వేదాలను అపహరించిన సోమకాసురుని సంహరించి, వేదాలను ఉద్ధరించినవాడు, జలప్రళయ కాలంలో సత్యవ్రతుడను రాజర్షిని రక్షించి సత్యుడని పేరు పొందినవాడగు శ్రీనివాసుని సేవించుకుంటాను.

**మహాగాధ జలాధారం కచ్ఛపం మందరోద్ధరం**
**సుందరాంగం చ గోవిందం శ్రీనివాసం భజే నిశమ్**

మిక్కిలిలోతైన సముద్రానికి ఆధారమైనవాడు, దేవతలు, రాక్షసులు అమృతం కొరకు పాలసముద్రాన్ని మధించినప్పుడు కవ్వముగా నున్న మంధర పర్వతాన్ని కూర్మరూపియై ఉద్ధరించినవాడు, ఏ అవతారమందైనను సుందరమైన శరీరము గలవాడు, గోవిందుడయిన (పాతాళం నుండి భూమిని ఉద్ధరించటానికి వరాహ రూపాన్ని ధరించినవాడు) శ్రీనివాసుని నేను ఎల్లప్పుడు సేవించెదను.

**వరం శ్వేతవరాహాఖ్యం సంహృత్య ధరణీ హరం**
**దంష్ట్రాకృత ధరోద్ధారం శ్రీనివాసం భజే నిశమ్**

శ్రేష్ఠమయిన శ్వేత వరాహ రూపమును ధరించి, భూమిని పాతాళానికి తీసుకొని పోయిన హిరణ్యాక్షుని సంహరించినవాడు, తన కోరతో పాతాళంలో పడివున్న భూమండలాన్ని ఉద్ధరించిన శ్వేత వరాహరూపియగు శ్రీనివాసుని నేను ఎల్లప్పుడు సేవించెదను.

**ప్రహ్లాదాహ్లాదకం లక్ష్మీనృసింహం భక్తవత్సలం**
**దైత్య మత్తేభ దమనం శ్రీనివాసం భజే నిశమ్**

రాక్షసులనే ఏనుగులకు సింహం వంటి వాడు, హిరణ్యకశిపుని సంహరించి, ప్రహ్లాదుని సంతోషపరచినవాడు, భక్తులందు వాత్సల్యంగలవాడు, లక్ష్మీ నరసింహరూపుడగు శ్రీనివాసుని నేను ఎల్లప్పుడు కొలుస్తుంటాను.

**వామనం వామనం పూర్ణకామం వామన మాణవం**
**మాయినం బలిసమ్మోహం శ్రీనివాసం భజే నిశమ్**

శోభనములైన కల్యాణ గుణాలచే భక్తులను ఆకర్షించువాడు, సంపూర్ణముగా తీరిన మనోరథములు గలవాడు, సుందరమైన బాలబ్రహ్మచారియై బలిచక్రవర్తిని మోహింప చేసినవాడు వామనరూపియగు శ్రీనివాసుని సేవిస్తుంటాను.

**ఇంద్వాననం కుందదంతం కురాజఘ్నం కుఠారిణం**
**సుకుమారం భృగు ఋషేః శ్రీనివాసం భజే నిశమ్**

చంద్రునితో సమానమైన ముఖంగలవాడు, మల్లెమొగ్గల వంటి దంతాలు గలవాడు. దుష్టక్షత్రియులను గొడ్డలితో సంహరించినవాడు, భృగువంశంలో జన్మించిన పరశురామరూపుడగు శ్రీనివాసుని ఎల్లప్పుడు కొలుతును.

**శ్రీరామం దశదిగ్వ్యాప్తం దశేంద్రియ నియామకం**
**దశాస్యఘ్నం దాశరథిం శ్రీనివాసం భజే నిశమ్**

పది దిక్కులందు వ్యాపించియున్నవాడు, పది ఇంద్రియాలను శాసించువాడు, దశముఖుడైన రావణుని సంహరించినవాడు, దశరథుని కుమారుడైన శ్రీరామునిగా అవతరించిన శ్రీనివాసుని నేను ఎల్లప్పుడు సేవించెదను.

**గోవర్ధనోద్ధరం బాలం వాసుదేవం యదూత్తమం**
**దేవకీతనం కృష్ణం శ్రీనివాసం భజే నిశమ్**

బాలుడైనను గోవర్ధన పర్వతాన్ని పైకెత్తి గోప సంఘమును రక్షించినవాడు, వసుదేవుని పుత్రుడు, యాదవులలో ఉత్తముడు, దేవకీ తనయుడు కృష్ణరూపుడైన శ్రీనివాసుని నేను నిత్యము సేవించెదను.

**నందనందన మానందనం ఇంద్రనీలం నిరంజనం**
**శ్రీయశోదాయశోదం చ శ్రీనివాసం భజే నిశమ్**

నందగోపుని కుమారుడు, ఆనందమును కలిగించువాడు, ఇంద్రనీలము వంటి శరీర వర్ణముగలవాడు, దోషరహితుడు, యశోదాదేవికి కీర్తిని కలిగించిన వాడు, కృష్ణరూపుడయిన శ్రీనివాసుని ఎల్లప్పుడు కొలుతును.

**గోవృందావనగం బృందావనగం గోకులాధిపం**
**ఉరుగాయం జగన్మోహనం శ్రీనివాసం భజే నిశమ్**

గోసంఘమును రక్షించినవాడు, బృందావన క్షేత్రములో సంచరించినవాడు, గోకులమునకు అధిపతి, వేదాలచే స్తుతింపబడినవాడు, జగత్తును మోహింపజేయువాడు కృష్ణరూపుడైన శ్రీనివాసుని నిత్యం సేవింతును.